





RNI NO : APTEL/2016/69464

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 48

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

శనివారం 18 జూలై 2026


## సంక్షోభంలో ఉన్న రాష్ట్రానికి నిర్మాలాసీతారామన్ సహకారం

- కూటమి వచ్చాక రుణాల రీ- షెడ్యూల్‌తో రూ.1538 కోట్లు ఆదా
- నరసరావుపేట రుణ వితరణ మేళాలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- వివిధ వర్గాలకు రూ.3,216 కోట్లు పంపిణీ చేసిన సీఎం, కేంద్ర మంత్రి







**నరసరావుపేట,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ప్రజల వద్దకే వెళ్లి రుణాలు అందించటం గర్వకారణమని, బ్యాంకులు రుణాలిచ్చే సంస్థలే కాదని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములన్నారు. రైతు భవిష్యత్తు మార్చడానికి, యువత కలలు నెరవేర్చడానికి, పారిశ్రామికవేత్తల లక్ష్యం నెరవేరడానికి రుణాలు ఎంతో ఉపయోగపడతాయని వ్యాఖ్యానించారు. గత వైసీపీ పాలనంతా సమస్యల సుడిగుండమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానిం చారు. గత ప్రభుత్వం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి రాష్ట్రానికి తిప్పలు తెచ్చిందని, కూటమి అధికారంలోకి వచ్చాకే ఆ రుణాల్ని కేంద్ర సహకారంతో రీ -షెడ్యూలు చేసి రూ.1,538 కోట్లు ఆదా చేశామని అన్నారు. పలనాడు జిల్లా నరసరావు పేటలో కేంద్ర ఆర్థిక శాఖ, ప్రభుత్వ రంగ బ్యాంకులు




సంయుక్తంగా నిర్వహించిన మెగా రుణమేళా కార్యక్రమానికి (క్రెడిట్ అవుట్ రీచ్) కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పలనాడు జిల్లాలో 1,03,246 మంది లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల రుణాలను అందజేశారు. ఇందులో భాగంగా 15 వేల మంది డ్వాక్రా మహిళలకు,13,355 మంది పారిశ్రామికవేత్తలకు రుణాలు పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ "పారిశ్రామి కవేత్తలుగా మారడానికి పల్నాడు చిరునామా కావాలి. పలనాడు పౌరుషానికి శక్తివంతమైన ఆయుధం ఇస్తున్నాం. క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమం నిర్వహిస్తున్న అందరికీ అభినందనలు. రైతులు, విద్యార్థులు, డ్వాక్రా సంఘాల మహిళలు ఇలా అర్హులైన వారందరికీ రుణం అందించటమే లక్ష్యం. మహిళా సాధికారతకు ఈ క్రెడిట్ అవుట్ రీచ్ ద్వారా ప్రయోజనాలు చేకూరతాయి. రెండేళ్ల క్రితం రాష్ట్రం

- 2లో

## పారదర్శకతంగా అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టండి

- ఎటువంటి ఉల్లంఘనలకు పాల్పడినా బాధ్యులపై కఠిన చర్యలు
- కొత్తగా ఏర్పాటయ్యే పరిశ్రమలకు వర్క్ ఫోర్స్ సిద్ధంచేయాలి
- ఐటిఐలను పరిశ్రమలతో అనుసంధానించి స్కిల్ గ్యాప్ భర్తీచేయండి
- ఉన్నత విద్య, స్కిల్ డెవలప్ మెంట్ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల పరిధిలో ఫ్యాకల్టీ భర్తీ ప్రక్రియలో విశ్వవిద్యాలయాలు, వైస్ చాన్సలర్లు అత్యంత పారదర్శకంగా వ్యవహరించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో ఉన్నత విద్య, స్కిల్ డెవలప్ మెంట్ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టుల భర్తీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలి, భర్తీ ప్రక్రియలో ఎటువంటి ఉల్లంఘనలు, ఆరోపణలు తలెత్తినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీల పరిధిలో అధ్యాపక పోస్టుల కోసం 1,90,509 అప్లికేషన్లు రాగా, వాటిలో 1,51,836 దరఖాస్తులు అర్హమైనవిగా నిర్ధారించినట్లు అధికారులు తెలిపారు. ఎలిజిబిలిటీకి సంబంధించి గ్రీవెన్స్ ను ఈనెల 21వతేదీ వరకు స్వీకరించి, 27వతేదీన అర్హుల తుదిజాబితా విడుదల చేస్తామని తెలిపారు. ఇంటర్వ్యూ ప్రక్రియను సైతం పూర్తి పారదర్శకంగా నిర్వహించేలా చూడాలి, ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయబోయే ప్రైవేటు యూనివర్సిటీల అనుమతులకు సంబంధించి విధివిధానాలు, వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి సెట్ల నిర్వహణ పురోగతిపై చర్చిస్తూ... సకాలంలో అడ్మిషన్లు పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రైవేటు వర్సిటీలకు అనుమతులు

- 2లో

## లేపాక్షి ద్వారా రాష్ట్ర హస్తకళలకు ప్రపంచ స్థాయి గుర్తింపు: మంత్రి సవిత




**న్యూఢిల్లీ, కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ హస్తకళలు, చేనేత ఉత్పత్తులను దేశ, విదేశీ మార్కెట్లలో మరింత విస్తృతంగా పరిచయం చేసి, కళాకారులకు స్థిరమైన ఉపాధి, మెరుగైన ఆదాయం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చేనేత, జౌళి, బీసీ సంక్షేమం, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత అన్నారు. సంప్రదాయ కళలను పరిరక్షించడంతో పాటు ఆధునిక మార్కెట్ అవకాశాలతో అనుసంధానం చేస్తూ కళాకారుల జీవనోపాధిని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె చెప్పారు. న్యూఢిల్లీలోని బాబా ఖరాక్ సింగ్ మార్గ్‌లోని స్టేట్ ఎంపోరియా కాంప్లెక్స్‌లో పునరుద్ధరించిన లేపాక్షి హస్తకళల ఎంపోరియంను శుక్రవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సబిత మాట్లాడుతూ, దేశ రాజధానిలోని ఈ లేపాక్షి ఎంపోరియం ఆంధ్రప్రదేశ్ కళా వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే కొనుగోలుదారులు, పర్యాటకులు, కళాభిమానులకు రాష్ట్ర హస్తకళలు, చేనేత ఉత్పత్తులను చేరువ చేస్తూ కళాకారులకు కొత్త మార్కెట్లను తెరుస్తుందని తెలిపారు. సంప్రదాయ కళలకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంలో లేపాక్షి కీలక పాత్ర పోషిస్తుందని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ సలహాదారు సుచిత్ర ఎల్లా మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌కు గొప్ప హస్తకళలు, చేనేత వారసత్వం ఉందని, వాటిని జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు తీసుకెళ్లడంలో లేపాక్షి కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఆధునిక సౌకర్యాలతో సంప్రదాయ కళలను ప్రజలకు మరింత చేరువ చేసేలా ఎంపోరియంను తీర్చిదిద్దినట్లు చెప్పారు. లేపాక్షి చైర్మన్ పసుపులేటి హరి ప్రసాద్ మాట్లాడుతూ, న్యూఢిల్లీ షోరూమ్ రాష్ట్ర కళాకారులకు మరింత మార్కెట్ అవకాశాలు కల్పిస్తుందని, జీఐ ట్యాగ్ పొందిన ఉత్పత్తులతో పాటు సంప్రదాయ హస్తకళలకు విస్తృత ప్రచారం లభిస్తుందని తెలిపారు. లేపాక్షి మేనేజింగ్ డైరెక్టర్ విశ్వ మనోహరన్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల హస్తకళలు, చేనేత ఉత్పత్తులను ఒకేచోట అందుబాటులో ఉంచేలా ఎంపోరియంను ఆధునికంగా అభివృద్ధి చేశామని తెలిపారు. కొండపల్లి, ఎటికొప్పాక బొమ్మలు, బొబ్బిలి వీణ, కలంకారీ చిత్రాలు, రాతి శిల్పాలు, ఇత్తడి కళాఖండాలు, గిరిజన కళాఖండాలు, మంగళగిరి, ఉప్పాడ, గద్వాల్, చీరాల, నారాయణవనం, పెదన కలంకారీ చీరలు తదితర ఉత్పత్తులు ఇక్కడ అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ కుమార్, చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి, అధికారులు, కళాకారులు, పలువురు ఆహ్వానితులు పాల్గొన్నారు.

## వర్జీనీయా పొగాకు కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు మరింత గిట్టుబాటు ధర కల్పించాలి

- కంపెనీలతో చర్చించి ధరలు పెరిగేలా టోబాకో బోర్డు చర్యలు తీసుకోవాలి
- 2026-27లో ఉత్పత్తిని సుమారు 81 మిలియన్ కిలోలకు పరిమితం చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తాం
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో వర్జీనీయా (FCV) పొగాకు కొనుగోళ్లను మరింత వేగవంతం చేసి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా అన్ని చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టోబాకో బోర్డును కోరారు. శుక్రవారం పొగాకు కొనుగోళ్ల పురోగతిపై మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, టొబాకో బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్, టొబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి. విశ్వశ్రీ, వ్యవసాయ శాఖ డైరెక్టర్ మంజీర్ జిలానీ సమూన్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో ప్రస్తుతం జరుగుతున్న ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లు, రైతులకు లభిస్తున్న ధరలు, మార్కెట్ పరిస్థితులు, కొనుగోళ్ల వేగవంతంపై విస్తృతంగా సమీక్షించారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, గత నాలుగు రోజులుగా పొగాకు కొనుగోళ్లు గణనీయంగా ఊపందుకున్నాయని, ప్రస్తుతం రోజుకు సుమారు 8.5 లక్షల కిలోల పొగాకును కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం గరిష్ఠంగా కిలోకు రూ.250 వరకు ధర లభిస్తోందని, రైతులకు మరింత మెరుగైన ధర వచ్చేలా కొనుగోలు సంస్థలతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని టొబాకో బోర్డును కోరారు. ముఖ్యంగా, పొగాకు కొనుగోలు సంస్థలపై సమర్థవంతమైన ఒత్తిడి తీసుకువచ్చి రైతులకు ఇంకా అధిక ధర లభించేలా చర్యలు చేపట్టాలని టొబాకో బోర్డు చైర్మన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు సూచించారు. కొనుగోళ్లు మరింత వేగవంతం కావడం వల్ల రైతులకు గిట్టుబాటు ధరలు లభించే అవకాశాలు మరింత మెరుగుపడతాయని మంత్రి పేర్కొన్నారు. అలాగే, తక్కువ నాణ్యత గల పొగాకును సాగు చేసిన రైతులు కూడా నష్టపోకుండా వారికి గిట్టుబాటు ధర లభించేలా కొనుగోలు సంస్థలతో ప్రత్యేకంగా చర్చలు జరపాలని టొబాకో బోర్డు అధికారులకు మంత్రి ఆదేశించారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని 2026-27 సీజన్‌లో ఎఫ్‌సీవీ పొగాకు ఉత్పత్తిని సుమారు 81 మిలియన్ కిలోలకు పరిమితం చేసే దిశగా వ్యవసాయ శాఖ, టోబాకో బోర్డుతో సమన్వయం చేసుకుని రైతులకు విస్తృత అవగాహన కల్పిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తిని నియంత్రించడం ద్వారా రైతులకు స్థిరమైన గిట్టుబాటు ధరలు లభించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.




# కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కు స్వాగతం పలికిన సీఎం, మంత్రి లోకేష్





**ఉండవల్లి,కలంకౌంటర్ :** కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్వాగతం పలికారు. పల్నాడు జిల్లా నర్సరావుపేటలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మెగా రుణమేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు ముందుగా ఉండవల్లి నివాసానికి చేరుకున్న నిర్మలా సీతారామన్ కు సీఎం చంద్రబాబు నాయుడుతో కలిసి మంత్రి లోకేష్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ ను మంత్రి శాలువాతో సత్కరించారు.

# కూటమి పొత్తుపై మంత్రి నాదెండ్ల మనోహర్ కీలక వ్యాఖ్యలు..!



**తెనాలి,కలంకౌంటర్ :** ఆరోజు ఓటు చీలనివ్వనని ఇచ్చిన మాట కోసం పవన్ కళ్యాణ్ నిలబడ్డారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రం కోసం వెనక్కి తగ్గాం. స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా వెనక్కి తగ్గుతాం అనుకుంటే పొరబాటు. సార్వత్రిక ఎన్నికల ఫార్ములా ఇప్పుడు వర్తించదు. జనసేనలో కష్టపడి పనిచేసిన వారికి స్థానిక సంస్థల ఎన్నికలలో అవకాశం ఇస్తాం.
: మంత్రి నాదెండ్ల మనోహర్

# ఆర్టీసీ బస్టాండ్ లో ఆయుష్ శాఖ ఆయుర్వేద వైద్యశిబిరం



**కావలి, కలంకౌంటర్ :** ఎపియస్ ఆర్టీసీ, కావాలి బస్టాండ్ లో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని డిపో మేనేజర్ డి.ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి సూచనల మేరకు బస్టాండ్ ఆవరణలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని అన్నారు.ఆయుష్ శాఖ వైద్యులు డాక్టర్ హాలీ మౌలాలి మాట్లాడుతూ, దీర్ఘకాల వ్యాధులకు ఆయుర్వేదంలో మంచి చికిత్స లభిస్తుందని, ఆర్టీసీ కార్మికులు, ప్రయాణికులు ఈ శిబిరాన్ని వినియోగించు కోవాలని కోరారు.ఈ శిబిరంలో 200 మందికి పైగా కార్మికులు, ప్రయాణికులు చికిత్సతో పాటు మందులు కూడా ఉచితంగా స్వీకరించారు. ఈ శిబిరంలో డాక్టర్ రాజనరసింహ, డాక్టర్ శ్రీరేఖ, డాక్టర్ రోహిణి తదితరులు పాల్గొన్నారు.

# సంక్షోభంలో ఉన్న రాష్ట్రానికి నిర్మలాసీతారామన్ సహకారం

● కూటమి వచ్చాక రుణాల రీ- షెడ్యూల్‌తో రూ.1538 కోట్లు ఆదా ● నరసరావుపేట రుణ వితరణ మేళాలో ముఖ్యమంత్రి చంద్రబాబు ● వివిధ వర్గాలకు రూ.3,216 కోట్లు పంపిణీ చేసిన సీఎం, కేంద్ర మంత్రి

(మొదటిపేజీ తరువాయి)

అంతా సమస్యల సుడిగుండంలో ఉంది. ఏపీలో ఆర్థిక విధ్వంసం చేశారు. కేంద్ర సహకారంతో అమరావతి, పోలవరం, విశాఖ ఉక్కు ఆకాంక్షలు నెరవేరాయి. వీబీజీ రామ్ జీ కింద కేంద్రం నుంచి రూ.7,707 కోట్లు రాష్ట్రానికి వస్తుంది. రాయలసీమను హార్టీ కల్చర్ హబ్ గా మార్చేందుకు కేంద్రం రూ.40 వేల కోట్లు ఆర్థిక సహకారం అందిస్తుంది.ప్రైవేటు పెట్టుబడులతో కలిపి ఈ ప్రాంతాన్ని ఉద్యాన హబ్ గా మారుస్తాం." అని సీఎం వివరించారు.



**నిర్మలా సీతా రామన్ సంస్కరణల వాది..** "మహిళలందరికీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదర్శంగా నిలుస్తున్నారు. 10 లక్షల డ్వాక్రా సంఘాలు రూ.29 వేల కోట్ల పొదుపుతో దేశంలోనే మేటిగా నిలిచాయి. రుణాల రీ పేమెంట్ లో 99.5 శాతంతో డ్వాక్రా మహిళలు అగ్రస్థానంలో ఉన్నారు. వారందరినీ మహిళా వ్యాపారవేత్తలుగా మార్చేందుకు వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమం చేపట్టాం. బ్యాంకింగ్ లో నిర్మలా సీతా రామన్ చాలా సంస్కరణలు తీసుకొచ్చారు. నష్టాల్లో ఉన్న చిన్న బ్యాంకులను విలీనం చేసి సమర్ధ బ్యాంకింగ్ వ్యవస్థకు దోహదం చేశారు. డిజిటల్ బ్యాంకింగ్ విప్లవం, జన్ ధన్ యోజన ద్వారా కోట్లాది బ్యాంకు ఖాతాలు, జీఎస్టీ శ్లాబ్ లను కుదించి పారదర్శక విధానం తెచ్చారు. వికసిత్ భారత్ 2047కు అనుగుణంగా చాలా సంస్కరణలు కేంద్ర మంత్రి నిర్మల తీసుకొచ్చారు. ఈ తరహా క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమాల్ని 6 జిల్లాల్లో నిర్వహించేందుకు తక్షణమే అంగీకరించారు. త్వరలోనే 3 నెలలకు ఒకటి చొప్పున ఈ తరహా కార్యక్రమాలు చేపడతాం." అని ముఖ్యమంత్రి అన్నారు

**చిన్న వ్యాపారులకు అండగా కేంద్రం-కేంద్ర మంత్రి..** దేశంలోని ప్రతి గ్రామంలోనూ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పమని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. తాను ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టే సమయానికి బ్యాంకులు ఎన్‌పీఏల సమస్యలతో ఇబ్బందుల్లో ఉండేవని, చిన్న వ్యాపారులు అప్పులు దొరక్క నష్టపోయేవారని గుర్తుచేశారు. చిన్న వ్యాపారుల ఆర్థిక కష్టాలను గుర్తించిన ప్రధాని మోదీ.. ప్రభుత్వమే గ్యారెంటీ ఇచ్చి బ్యాంకుల ద్వారా వారికి సులభంగా రుణాలు అందేలా పథకాలు తెచ్చారని వివరించారు. నేడు బ్యాంకులు స్వయంగా వ్యాపారుల చెంతకే వచ్చి రుణాలు ఇస్తున్నాయని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. మెగా రుణమేళాలో భాగంగా లబ్దిదారులకు ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి రుణ మంజూరు పత్రాలను, చెక్కులను అందజేశారు.

**ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ అందజేత..** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.42.16 లక్షల విలువైన అంబులెన్స్‌ను పిడుగురాళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి అందించారు. అలాగే నాబార్డు సౌజన్యంతో డీసీసీబీ (ణజజదీ) కి రూ.25 లక్షల విలువైన 2 మొబైల్ డెమో వ్యాన్లు అందించారు. అలాగే విద్యార్థినులకు రూ.17.80 లక్షల విలువైన 301 సైకిళ్లను పంపిణీ చేశారు. పర్యాటక శాఖకు గ్రామీణ బ్యాంక్ తరపున రూ.14 లక్షల విలువైన 2 బ్యాటరీ వాహనాలను అందించారు. వీటిని సీఎం చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం దివ్యాంగులకు ఉచితంగా ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, స్థానిక ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, భాష్యం రామకృష్ణ, పలువురు ఎమ్మెల్యేలు, బ్యాంక్ అధికారులు, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పారదర్శకతంగా అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టండి



(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చే సమయంలో యుజిసి నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టంచేశారు.

**జాబ్ మేళాల ద్వారా 1.37లక్షలమందికి ఉద్యోగాలు ..** స్కిల్ డెవలప్ మెంట్ శాఖపై మంత్రి సమీక్షిస్తూ... రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు నిర్వహించిన జాబ్ మేళాల ద్వారా 1.37లక్షల మంది యువతకు ఉద్యోగావకాశాలు లభించాయని తెలిపారు. యువతకు మరింత సౌలభ్యంగా ఉండేలా జాబ్ మేళాలను నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలోని ప్రతి ఐటిఐని పరిశ్రమలకు అనుసంధానించి, యువత నైపుణ్యాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో కొత్తగా వచ్చే పరిశ్రమలకు అవసరమైన వర్క్ ఫోర్స్ తయారు, స్కిల్ గ్యాప్ భర్తీపై నిర్మాణాత్మక చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందుకు సంబంధించి 81 ఆపరేషనలైజ్ ఇండస్ట్రీ అకడమిషియా పార్టనర్ షిప్స్‌ను సిద్ధం చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 23 జిల్లాకేంద్రాల్లో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్ ఆధ్వర్యాన రూ.94కోట్లతో ట్రైనింగ్ సెంటర్ల నిర్మాణానికి డిజైన్లు సిద్ధమైనట్లు అధికారులు తెలిపారు. నైపుణ్యం పోర్టల్ ను యువతకు ఉపయోగకరంగా తీర్చిదిద్ది, వచ్చేనెలలో ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ఇంటర్మీడియట్ తర్వాత ఉన్నత విద్యకు వెళ్లే విద్యార్థులకు ఎన్ రోల్ మెంట్ ఆధారంగా మొదటి సంవత్సరం నుంచే వివిధ ఉద్యోగాలు, వాటికి కావాల్సిన స్కిల్స్ సమాచారం, కెరీర్ గైడెన్స్ వివరాలతో నైపుణ్యం పోర్టల్ ద్వారా అప్ డేట్స్ వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి విద్యార్థికి స్కిల్స్ పై అవగాహన కల్పించడమేగాక ఆన్ లైన్ లో స్కిల్ పాస్ పోర్టు అందిస్తామని తెలిపారు. కళాశాల నుంచి చదువు పూర్తిచేసుకుని బయటకు వచ్చే ప్రతి విద్యార్థికి ప్లేస్ మెంట్ లభించేలా విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి చర్యలు చేపట్టాలి. రాష్ట్రంలో 169 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్లేస్ మెంట్ సెల్స్ ఏర్పాటుచేయాలని సూచించారు. ఫలితాల సాధనే అంతిమ లక్ష్యంగా అధికారులు పనిచేయాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉన్నత విద్య కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, స్కిల్ డెవలప్ మెంట్ సిఇఓ గణేష్ కుమార్, సీడాప్ సిఇఓ నారాయణస్వామి, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్. విజయభాస్కర్ పాల్గొన్నారు.

# 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పటిష్టమైన ఏర్పాట్లు చేయండి:సిఎస్ సాయిప్రసాద్



**అమరావతి,కలంకౌంటర్ :** ఆగష్టు 15వ తేదీన నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని వివిధ శాఖల అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ ఆదేశించారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై శుక్రవారం సచివాలయంలో ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 అనే నినాదంతో నిర్వహించనున్న రానున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పటిష్ట నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల వారీగా చేయాల్సిన ఏర్పాట్లపై ఆదేశాలు జారీ చేశారు.రాజధాని ప్రాంతంలోని ప్రస్తుత పెరేడ్ గ్రౌండ్ లో నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.ఏర్పాట్ల విషయంలో ఎలాంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు,పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు వీలుగా సంబంధిత శాఖలు ప్రత్యేక శకటాల ప్రదర్శనకు తగిన చర్యలు తీసుకోవాలని సిఎస్.సాయి ప్రసాద్ ఆదేశించారు.ముఖ్యంగా ఇప్పటి వరకూ ఆయా శాఖల ద్వారా అభివృద్ధి సంక్షేమానికి సంబంధించి ఏవిధమైన చర్యలు తీసుకున్నారు సాధించిన ప్రగతిని వివరించడంతో పాటు రానున్న రోజుల్లో చేపట్టనున్న కార్యక్రమాలు తద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలు ప్రతిబించే రీతిలో ఆయా శకటాలు ఏర్పాటు ఉండాలని స్పష్టం చేశారు.ఇందుకు సంబంధించి సమాచార శాఖ సంచాలకులు కెఎస్ విశ్వనాధన్ ను ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని మెరుగైన రీతిలో శకటాల ఏర్పాటు చేసేలా చూడాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అందరు అఖిల భారత సర్వీసుల అధికారులు సహా అన్ని శాఖల అధికారులు,ఉద్యోగులు తప్పని సరిగా హాజరు కావాలని ఈవిషయంలో ఎంత మాత్రం నిర్లక్ష్యం చేయవద్దని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ స్పష్టం చేశారు. వేడుకల ప్రాంగణంలో తగిన ఏర్పాట్లు చేయాలని సిఆర్డిఏ,గుంటూరు జిల్లా కలక్టర్ సహా పలువురు అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలపై ముఖ్య అతిథి వారి సందేశం తయారు చేయడం,మెరైగైన పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు,కామెంటేటర్లను సిద్ధం చేయడం,హోర్డింగ్ల ఏర్పాటు వంటి అంశాల్లో సమచార శాఖ డైరెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో జిఏడి ముఖ్య కార్యదర్శి జె.శ్యామల రావు రానున్న స్వాతంత్ర్య దినోత్స వేడుకలకు వివిధ శాఖల వారీగా చేయాల్సిన ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు.పోలీస్ శాఖ తరుపున తగిన బందోబస్తు,పార్కింగ్ వంటి ఇతర ఏర్పాట్లు సక్రమంగా చేయాలని సూచించారు.గుంటూరు జిల్లా కలక్టర్ ఓవర్ ఆల్ ఇంచార్జిగా వేడుకల ఏర్పాట్లను పర్యవేక్షించాలని చెప్పారు.సిఆర్డిఏ అధికార్లు వేదిక ప్రాంగణాన్ని అన్ని విధాలా సన్నద్ధం చేయాలని సూచించారు.ఇంకా సంబంధిత శాఖల వారీగా చేయాల్సిన ఏర్పాట్లపై తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈసమావేశంలో ఎంఎయుడి ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్,ఐజి రాజ కుమారి, సమాచార శాఖ సంచాలకులు కె.ఎస్.విశ్వనాథన్, అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్ లక్ష్మీ పార్థ సారథి,గుంటూరు జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ,ఎస్పి వకుల్ జిందాల్, సిఆర్డిఏ అదనపు కమీషనర్ భార్గవ్ తేజ ఇతర అధికారులు పాల్గొన్నారు.అదే విధంగా వర్చువల్ గా వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి వీరపాండ్యన్ సహా పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆర్టిఐ కృష్ణా జిల్లా కన్వీనర్ గా హేమలత



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** యుఎస్ఆర్టీఐ ఉమ్మడి కృష్ణాజిల్లా మహిళా విభాగం కన్వీనర్ గండిగుంట పంచాయతీ ఆనందపురంకు చెందిన గుంజా హేమలత నియమితులయ్యారు. హేమలతకు నియామక పత్రాన్ని రాష్ట్ర మాజీ సమచార కమిషనర్ ఐలాపురం రాజా, యుఎస్ఆర్టీఐ నాయకులు జెఎస్ గౌడ్ శుక్రవారం అందచేశారు. ఈసందర్భంతా ఆమె మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారహక్కు చట్టం -2005 లోని సెక్షన్ 4(1)(బి) నిబంధనలు సమర్థవంతంగా అమలుచేయించేందుకు కృషి చేస్తానన్నారు. సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన పెంపొందించి, పారదర్శక పాలనకు తోడ్పడేలా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. యుఎఫ్ఆర్టీఐ మహిళా విభాగం కన్వీనర్గా హేమలత నియామకం పట్ల బేతపూడి జోగేశ్వరరావు, బి దుర్గా ప్రసాద్, ఎం సాంబశివరావు, బి శివపార్వతి అభినందనలు తెలియచేశారు.

# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుభాకాంక్షలు

**ఒంగోలు,కలంకౌంటర్ :** ఈ మధ్యనే ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బొగ్గవరపు సుబ్బారావు పుట్టినరోజు, రెండు రోజుల క్రితం జరుగుమల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కోటా కిషోర్ బాబు పుట్టినరోజు, ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు బైసాని వెంకట సుబ్బారావు ను టంగుటూరు తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగంగా అధ్యక్షులుగా నియమితులైన సందర్భంగా ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం, ఐవిఎఫ్ ప్రకాశం జిల్లా ఆధ్వర్యంలో ఒంగోలు వైశ్య భవన్ నందు వారిని ఘనంగా సన్మానించి కేకు కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు సూపర్ బజార్ చైర్మన్ పల్లపోతు వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులు జలదంకి వెంకటకృష్ణారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల శ్రీనివాసులు, ఆర్యవైశ్య మీడియా చైర్మన్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు, ఐవిఎఫ్ జిల్లా అధ్యక్షులు



మురారిశెట్టి సుధీర్ కుమార్, ఆర్యవైశ్య మహాసభ మాజీ కార్యదర్శి చినగేపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.





# శ్రీరంగం నుండి తిరుమల శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పణ

-తిరుమల,కలంకౌంటర్ :

# శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న పోలీసు సిబ్బంది తమ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలి - జిల్లా కలెక్టర్ .పి.రాజాబాబు




**ఒంగోలు,కలంకౌంటర్ :** కిమ్స్ ఆసుపత్రి సహకారంతో జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో నిర్మించిన పోలీస్ ఆరోగ్య కేంద్రాన్ని ప్రకాశం జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు,జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు కిమ్స్ ఆసుపత్రుల చైర్మన్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు లతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. పోలీస్ ఆరోగ్య కేంద్రంలో రిసెప్షన్, మందులు పంపిణీ కేంద్రం (డ్రగ్స్ డిస్పెన్సరీ), ల్యాబొరేటరీ, వైద్యుల గదులు, నిపుణులైన వైద్యుల సేవల కోసం ప్రత్యేక గదులు, విశాలమైన హాల్‌తో పాటు ఇతర అవసరమైన సౌకర్యాలను కల్పించారు. పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందేలా అనుకూల వాతావరణంలో ఈ హాస్పటిల్ ను నిర్మించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు మాట్లాడుతూ విధుల నిర్వహణలో ఒత్తిడి ఎదుర్కొంటున్న పోలీసు సిబ్బంది తమ ఆరోగ్యం పైనా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఆరోగ్యవంతమైన పోలీసు సిబ్బందే ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించగలరని అన్నారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్య సేవలు పొందడం అవసరమన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం జిల్లా పోలీసు శాఖ చేపడుతున్న చర్యలు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది సంక్షేమం, ఆరోగ్య సంరక్షణకు జిల్లా పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నమన్నారు. సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నూతన పోలీస్ హాస్పిటల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విధుల్లో సిబ్బంది మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాకుండా ఆరోగ్యం మహాభాగ్యమన్న ప్రతి ఒక్కరూ గుర్తించుకొవాలన్నారు. నూతన పోలీస్ హాస్పిటల్‌లో సాధారణ వైద్య సేవలతో పాటు ప్రాథమిక చికిత్స, క్రమానుగత ఆరోగ్య పరీక్షలు, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కిమ్స్ ఆస్పత్రుల చైర్మన్ బొల్లినేని భాస్కరరావు మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఆరోగ్య పరిరక్షణలో తాము కూడా భాగస్వాములము కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఒ సీఈఓ బొల్లినేని అద్విక్, డైరెక్టర్ శ్రీ టి. గిరినాయుడు, ఆర్‌సీఓ ప్రవీణ్, కిమ్స్ ఒంగోలు సీఓఓ కె. అంకిరెడ్డి, కిమ్స్ ప్రతినిధి హరి రెడ్డి, పోలీస్ డాక్టర్ డా. శ్రీనివాసరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు, ఒంగోలు సబ్ డివిజన్ సీఐలు విజయకృష్ణ, వెంకటేశ్వరరావు, శేషగిరి రావు, ప్రసాద్, హాజరత్తయ్య, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, ఎస్సై వేణు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అండగా "సఖి - వన్ స్టాప్ సెంటర్" - జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్




**విజయనగరం,కలంకౌంటర్ :** జిల్లాలో స్థానిక ఉడా కాలనీలో ఉన్న వన్ స్టాప్ సెంటర్‌ను జిల్లా ఎస్పీ లిఎ.ఆర్.దామోదర్ సందర్శించారు. "సఖి - వన్ స్టాప్ సెంటర్" ద్వారా బాధిత మహిళలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ - మహిళలు, బాలికలకు అత్యవసర పరిస్థితుల్లో భద్రత, ఉచిత న్యాయ సహాయం, వైద్య సేవలు, మానసిక పరామర్శ, తాత్కాలిక ఆశ్రయం వంటి సమగ్ర సేవలను ఒకేచోట వన్ స్టాప్ సెంటర్ లో అందిస్తున్నామని తెలిపారు. అనంతరం వన్ స్టాప్ సెంటర్‌లోని రిజిస్టర్‌లు, కేసుల నిర్వహణ విధానం, కౌన్సెలింగ్ సేవలు, న్యాయ సహాయం, వైద్య సేవల సమన్వయం, అత్యవసర స్పందన విధానాలను ఎస్పీ పరిశీలించారు. వన్ స్టాప్ సెంటర్ లో ఆశ్రయం కోసం వచ్చిన మహిళలతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సేవలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. మహిళలపై జరిగే వేధింపులు, గృహహింస, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా వంటి కేసుల్లో బాధితులకు తక్షణ సహాయం అందించడం వన్ స్టాప్ సెంటర్ ప్రధాన బాధ్యత అని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ప్రతి బాధితురాలిని సానుభూతితో, గౌరవంతో చూడాలని, వారి వ్యక్తిగత గోప్యతను కాపాడుతూ చట్టపరమైన అన్ని సహాయాలు అందించాలని అధికారులకు జిల్లా ఎస్పీ ఆదేశించారు. మహిళల మరియు చిన్నారుల భద్రతకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలను గ్రామాలు, పట్టణాలు, విద్యాసంస్థలలో మరింత విస్తృతంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. మహిళలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా, ఆత్మవిశ్వాసంతో జీవించేలా పోలీసు శాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, వైద్య శాఖ, న్యాయ సేవా సంస్థలు పరస్పర సమన్వయంతో పనిచేసి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో బాధితులు పోలీసు సహాయం కోసం 100/112, మహిళల సహాయ కేంద్రం 181, 1098 అలాగే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. మహిళల భద్రతకు జిల్లా పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా ఎస్పీ తెలిపారు. మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి పోలీసు అధికారి బాధిత మహిళలకు భరోసా కల్పించే విధంగా వ్యవహరించాలని, వారి ఫిర్యాదులను అత్యంత సున్నితంగా స్వీకరించి వేగంగా దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం వన్ స్టాప్ సెంటర్‌లో పరిశుభ్రత, భద్రతా ఏర్పాట్లు, విశ్రాంతి గదులు, కౌన్సెలింగ్ గదులు, వైద్య సహాయ సదుపాయాలను కూడా జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ, పి.వి.వి.నరసింహారావు, సిఐ ఈ.నరసింహమూర్తి, ఎస్బీ సిఐ ఎ.వి.లీలారావు, సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పి.విజయలక్ష్మి, డొమెస్టిక్ వయొలెన్స్ సెల్ లీగల్ కౌన్సిలర్, మాధవి,సిబ్బంది పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ సేవలు విస్తృతం చేయాలి - డీఆర్వో విజయకుమార్



**కావలి,కలంకౌంటర్ :** ఇండియన్ రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాలు మానవతకు ప్రతీకగా నిలుస్తున్నాయని రెడ్ క్రాస్ తాత్కాలిక అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్ తెలిపారు.గురు వారం రెడ్ క్రాస్ రక్తనిధి సమావేశ మందిరంలో సొసైటీ అడహక్ మేనేజింగ్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది.ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ రక్తనిధి,తలసీమియా విభాగం,విపత్తు సహాయక చర్యలు,వృద్ధులు, మహిళలు,పిల్లలు, నిరుపేదలకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు మరింత విస్తృతం చేయాలని అడహక్ కమిటీకిసూచించారు. అడహక్ కమిటీ సభ్యులుగా యాలమూరి రంగారావు, డాక్టర్ సర్వేపల్లి విజయకుమార్, కమలేష్ కుమార్ జైన్,జనార్దన్ రాజు ,డాక్టర్ దయాకర్రావు, డా.పాదర్తి నాగరాజు, కలికిశ్రీహరిరెడ్డి, జనార్దన్ రెడ్డి, సుధాకర్ రావు, మల్లు స్వాతి రెడ్డి, కుడుముల సుధాకర్ రెడ్డి, జిల్లా కో ఆపరేటివ్, జిల్లా ఆడిట్ అధికారులు ప్రమాణ స్వీకారం చేశారు. రెడ్ క్రాస్ ఆశయాలకు అనుగుణంగా సేవాభావంతో పనిచేస్తామని సభ్యులు తెలియ చేశారు. ఈ సందర్భంగా విశ్రాంత డిప్యూటీ ఇంజనీర్ గోసుల వెంకట సుబ్బారెడ్డి రెడ్ క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి రూ.2 లక్షలువిరాళంఅందచేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యాలయ కార్యదర్శి మస్తానయ్య పాల్గొన్నారు.

# అధికారులు నిర్లక్ష్యం వీడాలి



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** వైసీపీ పాలనలో అలావాటైన నిర్లక్ష్యానికి అధికారులు ముగింపు పలకకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం అడితే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ హెచ్చరించారు. ఆకునూరు సమీపాన జాతీయ రహదారి వెంబడి మట్టిపేరుకుపోయి వర్షపునీరు నిలిచి బురదకయ్యగా తయారై వాహనచోదకులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని శుక్రవారం గమనించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా తానే స్వయంగా పార చేతబట్టి బురద తొ లగించి కచ్చాడ్రెయిన్ తవ్వి నీరు పోయేలా మార్గం చేశారు. ఈసందర్భంగా మాటా డుతూ ఎమ్మెల్యే స్వయంగా రంగంలోకిదిగి పనులు చేయాల్సిన పరిస్థితి రావడం వైసీ పీ పాలనలో అధికారులల్లో పెరిగిన బాధ్యతారహిత్యానికి నిదర్శనంగా కన్పిస్తుందన్నా రు. గతప్రభుత్వ పాలనలో ప్రజాసమస్యలు పట్టించుకోని నిర్లక్ష్య సంస్కృతి అధికారుల్లో కి చొరబడిందని, కూటమి ప్రభుత్వంలో అ నిర్లక్ష్యానికి స్థానం లేదన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే ఏఅధికారి అయినా బాధ్యత వహించాల్సిందే అని పంచాయ తీ కార్యదర్శిని హెచ్చరించారు. జాతీయ రహదారి వెంబడి ఉన్న గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఫీల్డ్లో పర్యటిస్తూ రోడ్లు, డ్రె యిన్లు, పారిశుధ్య పరిస్థితులు పరిశీలించాలన్నారు. నిర్లక్ష్యం, అలసత్వం ప్రదర్శిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు.

# శాకంబరీ ఉత్సవానికి పోటెత్తిన అశేష భక్తజనం

## సారెతో విచ్చేసిన మహిళా బృందాలు





**చందోలు( బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** బాపట్ల జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీ బగళాముఖి అమ్మవారి దేవస్థానం, చందోలులో నిర్వహిస్తున్న శ్రీ వారాహి నవరాత్రి మహోత్సవాలు మూడవ రోజు అత్యంత వైభవోపేతంగా కొనసాగాయి. శుక్రవారం నిర్వహించిన శ్రీ శాకంబరీ దేవి అలంకారం వేలాది మంది భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శాకంబరీ అలంకారం కోసం సుమారు 800 కిలోల కూరగాయలు, దుంపలు, ఆకుకూరలు, పండ్లు వినియోగించడం విశేషం. ఇందులో 13 రకాల కందమూలాలు, 27 రకాల కూరగాయలు, 13 రకాల పండ్లు, 6 రకాల ఆకుకూరలు ఉపయోగించి అమ్మవారిని అపూర్వంగా అలంకరించారు. ఈ విశిష్ట అలంకరణ కోసం సుమారు 40 మంది వాలంటీర్లు 16 గంటలపాటు నిరంతర శ్రమ చేశారని ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కలకోడ చక్రధర్ రెడ్డి తెలిపారు. ఈ శాకంబరీ అలంకరణను విజయవాడకు చెందిన ప్రముఖ అలంకార నిపుణుడు సంజీవ్ కుమార్ శర్మ పర్యవేక్షణలో అత్యంత శాస్త్రోక్తంగా, కళాత్మకంగా రూపొందించారు. అలంకరించిన అమ్మవారి దివ్యరూపాన్ని దర్శించిన భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయి ప్రత్యేక అర్చనలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన కదంబ ప్రసాదంతో పాటు దుంపలతో ప్రత్యేకంగా తయారు చేసిన స్వీట్ ప్రసాదాన్ని వేలాది మంది భక్తులకు పంపిణీ చేశారు. ఒంగోలుకు చెందిన తెల్లపాటి శ్రీనివాసరావు -- కనకదుర్గ దంపతులు భక్తులందరికీ మహా అన్నప్రసాద వితరణ నిర్వహించి భక్తుల ప్రశంసలు అందుకున్నారు. ఆషాఢ మాసం సందర్భంగా చందోలు గ్రామానికి చెందిన ఆర్యవైశ్య కుటుంబాల 60 మంది మహిళలు సంప్రదాయబద్ధంగా సారెలు, పూజా ద్రవ్యాలు తీసుకొని మంగళ వాయిద్యాల నడుమ శోభాయాత్రగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి సమర్పించడం ఉత్సవానికి మరింత వైభవాన్ని చేకూర్చింది. ఈ కార్యక్రమంలో దేవస్థాన పాలకమండలి సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు, ఋత్వికులు, ఆలయ సిబ్బంది, వాలంటీర్లు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ విషయాన్ని దేవస్థానం కార్యనిర్వహణాధికారి జి. నరసింహమూర్తి తెలిపారు.

# మేజిషియన్ మాధవరావుకు ప్రతిష్టాత్మక నాబార్డ్ అవార్డు



**కావలి,కలంకౌంటర్ :** కావలి వాస్తవ్యులు,ప్రముఖ ఇంద్రాజాలికులు కళారత్న "వేములపాటి మాధవరావు"తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టాత్మక" నాబార్డ్ అవార్డు" అందుకున్నారు. నాబార్డ్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డు అందజేశారు. గత 12 సంవతరాల నుండి ఇప్పటివరకు కొన్ని వందల ప్రదర్శనలు ఇచ్చి గ్రామీణ గిరిజన ప్రాంత ప్రజల ను ఆర్థికంగా చైతన్య వంతులు చేయడం, నీటిపొదుపు, భూగర్భజలాలపెంపు,వాటర్ షెడ్స్ - వాటి సంరక్షణ,అడవుల సంరక్షణలాంటి అంశాలగురించి అవగాహన కల్పించడంలో మాధవరావు చేసినకృషి చాలా గొప్పదని, ఆయా అంశాలను మేజిక్ ద్వారా ఈ విషయాలను అవగాహనా కలిగింగించడంలో మాధవరావు చెసిన ప్రయోగాలు మేధావులను సైతం ఆశ్చర్యన్ని కలిగించాయని ఈ కార్యక్రమంలో తెలంగాణా రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఫర్ రూరల్ డెవలప్మెంట్ అండ్ రూరల్ వాటర్ సప్లై దానకిశోర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ బి. ఉదయభాస్కర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు పట్టణ ప్రముఖులు మాధవరావును అభిందించారు.

# లక్ష రూపాయలు విరాళం ప్రకటించిన మద్దుల




**కావలి,కలంకౌంటర్ :** రెడ్ క్రాస్ భవనం నందు అయిదుగురు తలసేమియా వారియర్స్ కు బ్లడ్ ట్రాన్స్ఫ్యూషన్ చేసి వారికి ఆరోగ్యకరమైన డ్రై ఫ్రూట్స్ అందించడం జరిగింది. ప్రముఖ ఆర్య వైశ్య వ్యాపారవేత్త ముద్దుల నరసింహారావు తల సేమియా వారియర్ ఒకరిని దత్తత తీసుకుని, ఒక లక్ష రూపాయలు విరాళం ప్రకటించి రెడ్ క్రాస్ కమిటీ కి అందజేసారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో రెడ్ క్రాస్ ప్రతినిధులు,డా. నరేంద్ర- రమ్యదీపిక దంపతులు పాల్గొని,ముద్దుల నరసింహారావుని శాలువా తో సత్కారం చేశారు.

# గుడ్లూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన డి.రమేష్





**గుడ్లూరు,కలంకౌంటర్ :** గుడ్లూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన డి.రమేష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ని మర్యాదపూర్వకంగా కలిశారు. గుడ్లూరు సర్కిల్ పరిధిలో నేరాలు, అసాంఘిక కార్యకలాపాల పట్ల కఠినంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే సూచించారు.

# జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గా మారుటూరి



**బాపట్ల,కలంకౌంటర్ :** బాపట్ల జిల్లా ఆర్యవైశ్య సంఘం అద్యక్షులుగా మారుటూరి రాఘవేంద్ర రావు, కార్యదర్శి గా నాగవరపు వెంకట నాగ పవన్ కుమార్ లు నియమితులయ్యారు

# నిజ జీవిత హీరోలు రక్త దాతలు




**కందుకూరు, కలంకౌంటర్ :** ఒక రోగి ప్రాణం కాపాడడానికి అతి త్వరగా స్పందించి కేవలం 15నిమిషాలలో ఆస్పత్రి చేరుకుని రక్త దానం చేశారు ఇద్దరు రక్త దాతలు సామి శ్రీకాంత్, మిట్టపల్లి అయ్యప్ప. అతి త్వరగా వీరిద్దరూ స్పందించి ఒక రోగి నిండు ప్రాణాన్ని కాపాడారు. వీరు స్పందించిన తీరుకి అభినందించకుండా ఉండలేము. కందుకూరు లోని ఒక ఆసుపత్రి లో ఆపరేషన్ మధ్యలో ఒక రోగికి విపరీతమైన రక్తస్రావం అవడం వల్ల అతనికి వెంటనే రక్తం అవసరమైంది. దీనికి వెంటనే స్పందించిన ఒక షాపులో అకౌంటెంట్ సామి శ్రీకాంత్, మిఠాయి వ్యాపారం చేసే మిట్టపల్లి అయ్యప్ప తమ పనిని పక్కన పెట్టేసి ఫోన్ చేసిన 5నిమిషాల్లో ఆసుపత్రి చేరుకుని రక్త దానం చేసి ఆ రోగి ప్రాణాలు కాపాడారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ చైర్మన్ చన్నా రామాంజనేయులు శ్రీకాంత్ ను, అయ్యప్పను అభినందించారు. పేషంట్ కుటుంబ సభ్యులు రక్తదాతలకు ధన్యవాదాలు తెలిపారు.

# దేవుడి తోట ఎస్టీ కాలనీలో లక్ష రూపాయల దుస్తులు పంపిణీ....





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** శ్రీ ధర్మ శాస్త్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మచిలీపట్నం దేవుడి తోటలోని యానాదుల కాలనీలో అందరికీ లక్ష రూపాయలు ఖరీదు చేసే కొత్త చీరలు లుంగీలు టవల్స్ ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ నగర తెలుగుదేశం పార్టీ నాయకులు నడకుదిటి అర్జున,కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సన్నిధి నాగ సాయి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లంకిశెట్టి మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా మన కన్వెన్షన్ అధినేత గొరిపర్తి శ్రీధర్ అతని స్నేహితుల ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా నిరుపేదలైనటువంటి యానాదులకు ప్రతి ఆషాడ మాసంలో దుస్తులు పంపిణీ చేయడం వారి యొక్క స్నేహితులు వితరణ ఇతరులకు ఆదర్శప్రాయంఅన్నారు. ఎస్టీ కాలనీలో గంజాయి, వైటనర్, మద్యం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, పిల్లలను కనీసంగా చదివించాలని బాలాజీ అన్నారు. మచిలీపట్నం ఎస్టి కాలనీలో ఒక బాలికను ఫైర్ ఆఫీసర్ సుధాకర్ డిగ్రీ రెండవ సంవత్సరం తన ఖర్చులతో చదివించటం అభినందనీయమన్నారు గొరిపర్తి శ్రీధర్ తన స్నేహితులు తమ సంపాదనలో కొంత భాగం సమాజానికి ఇవ్వాలనే సంకల్పంతో మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ఆదర్శప్రాయం అన్నారు. నడకుదిటి అర్జున మాట్లాడుతూ పేదవాళ్ళని ఆదుకోవడంలో ప్రభుత్వం పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావడం స్వాగతించదగిన విషయమని అన్నారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సన్నిధి నాగ సాయి మాట్లాడుతూ సొంత లాభం కొంత మానుకో పొరుగు వాడికి సహాయం చేయి అనే సూక్తిని గొరిపర్తి శ్రీధర్ స్నేహితులు అమలు చేయడం ఆదర్శప్రాయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 150మంది మహిళలకు వందమంది పురుషులకు దుస్తులు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో దాతలు గోరిపర్తి శ్రీధర్ అతని స్నేహితులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా అంతర్జాతీయ న్యాయ దినోత్సవ వేడుకలు...




**మచిలీపట్నం,కలంకౌంటర్ :** అంతర్జాతీయ న్యాయ దినోత్సవ వేడుకలు మచిలీపట్నం భార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు తుంగల హరిబాబు మాట్లాడుతూ న్యాయ వ్యవస్థ ఉన్నతి కోసం సత్వర కేసులు పరిష్కారం కోసం న్యాయవాదులందరూ కలిసికట్టుగా కృషి చేస్తున్నామని తెలియజేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం న్యాయ వ్యవస్థ కట్టుబడి ఉందని, 125 సంవత్సరాల చరిత్ర కలిగిన మచిలీపట్నం బార్ అసోసియేషన్కు న్యాయ వ్యవస్థలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని ఎందరో న్యాయమూర్తులను అందించిన భార్ అసోసియేషన్ మచిలీపట్నం బార్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సర్వ లలిత కుమారి లైబ్రరీ కార్యదర్శి పి. సూర్య ప్రకాష్ సీనియర్ న్యాయవాదులు సోడిశెట్టి బాలాజీ రావు కొట్టే రఘురామ్,మాజీ ఏపీపీ అడపా మురళి, మాజీ జిల్లా ప్రభుత్వం న్యాయవాది ఉప్పలపు సుబ్రమణ్యం, రెడ్రౌతు రమణారావు, వంక లావణ్య, శరణ్య పలువురు అడ్వకేట్స్ పాలుగున్నారు "

**లంకిశెట్టి వితరణ"...** అంతర్జాతీయ న్యాయ దినోత్సవం పురస్కరించుకుని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ తన జూనియర్స్ తో కలిసి బార్ అసోసియేషన్ కు లైబ్రరీ భద్రపరుచుకుని బీరువాను మరియు పుస్తకాలను క్రిమినల్ మేజర్ యాక్ట్ పుస్తకాలను బార్ అసోసియేషన్ కి లంకిశెట్టి సాయి ఫణి సంతోష్ ద్వారా అందజేశారు. లంకి శెట్టి సాయి ఫణి సంతోష్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు న్యాయశాఖ సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు

# బైసాని ని ఘనంగా సన్మానించిన మాజీ మంత్రి డాక్టర్ శిద్దా



**ఒంగోలు,కలంకౌంటర్ :** ఈ మధ్యనే టిడిపి టంగుటూరు మండల వాణిజ్య విభాగం అధ్యక్షులుగా ప్రకాశం జిల్లా ఐ వి ఎఫ్ ప్రధాన కార్యదర్శి బై సాని వెంకటసుబ్బారావు నియమితులైన సందర్భంగా శుక్రవారం మాజీ మంత్రి డాక్టర్ శిద్దా రాఘవరావు ని వారి నివాసమందు బైసాని వెంకట సుబ్బారావు డాక్టర్ శిద్దా రాఘవరావు ని మర్యాదపూర్వకంగా కలిసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా సుబ్బారావుని రాఘవరావు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బొగ్గవరపు సుబ్బారావు, ఒంగోలు సూపర్ బజార్ చైర్మన్ పల్లపోతు వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులు జలదంకి వెంకటకృష్ణారావు, ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి మువ్వల శ్రీనివాసులు, ఆర్యవైశ్య మీడియా చైర్మన్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు, ఐవిఎఫ్ జిల్లా అధ్యక్షులు మురారిశెట్టి సుధీర్ కుమార్, ఆర్యవైశ్య మహాసభ మాజీ కార్యదర్శి చినగేపల్లి సురేష్, జిల్లా ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షులు బైసాని వెంకట సుబ్బారావు, జరుగుమల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కోటా కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి డాక్టర్ శిద్ధా దంపతులను ఘనంగా సన్మానించిన ఆర్యవైశ్య సంఘం



**ఒంగోలు,కలంకౌంటర్ :** మాజీ మంత్రివర్యులు డాక్టర్ శిద్దా రాఘవరావు సతీమణి శిద్దా లక్ష్మీ పద్మావతి ని ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగ్ గౌరవ అధ్యక్షురాలుగా నియమించిన సందర్భంగా ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బొగ్గవరపు సుబ్బారావు ఆధ్వర్యంలో ఒంగోలు వారి నివాసమందు కలిసి ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు రావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు సూపర్ బజార్ చైర్మన్ పల్లపోతు వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులు జలదంకి వెంకటకృష్ణారావు, ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి మువ్వల శ్రీనివాసులు, ఆర్యవైశ్య మీడియా చైర్మన్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు, ఐవిఎఫ్ జిల్లా అధ్యక్షులు మురారిశెట్టి సుధీర్ కుమార్, ఆర్యవైశ్య మహాసభ మాజీ కార్యదర్శి చినగేపల్లి సురేష్, జిల్లా ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షులు బైసాని వెంకట సుబ్బారావు, జరుగుమల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కోటా కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# పెడన వరకట్న వేధింపులు కేసు కొట్టివేత...

## ఛానల్ కెమెరామెన్ నిర్దోషిగా విడుదల...

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** పెడన బ్రహ్మపురముకు చెందిన బళ్ళ (25)కామేశ్వరి కి హైదరాబాదులోని ప్రముఖ ఛానల్లో కెమెరామన్ గా పనిచేస్తున్న బళ్ళ దుర్గాప్రసాద్ తో 2013 ఫిబ్రవరి 14వ తారీఖున పెడన లో వివాహం జరిగింది.. వివాహకాలంలో నగదు బంగారం కట్న కానుకలుగా ఇచ్చారు. తర్వాత భర్త ప్రముఖ టీవీ ఛానల్ లో కెమెరా పనిచేస్తూ హైదరాబాదులో కాపురం పెట్టారు. హైదరాబాదులో తన భర్త తనను అధిక కట్నం కోసం వేధింపులకు గురి చేశాడని బాధలు పెట్టాడని భార్య ఆరోపించింది. వారిద్దరికీ 2013 నవంబర్ 20 తారీకున ఆడపిల్ల కూడా పుట్టింది.ఆడపిల్ల పుట్టిన తర్వాత ఇద్దరు కలిసి హైదరాబాదు యూసఫ్ గూడా లో కాపురం పెట్టారు. తాను అందంగా లేనని తన భర్త గొడవ పడుతూ వ్యక్తిగతంగా దూషిస్తూ 2016లో తనను ఇంటి నుండి గెంటివేశాడని తన భర్తతో పాటు తన అత్త బళ్ళ వసుంధర కూడా వే దింపులకు గురిచేస్తుంది అని పేర్కొంటూ 2018లో భార్య కామేశ్వరి మచిలీపట్నం మొబైల్ కోర్టులో కంప్లైంట్ దాఖలు చేసింది. 8 సంవత్సరాల సుదీర్ఘ విచారణ అనంతరం భర్తపై మోపిన నేర రోపణకు తగిన ఆధారాలు లేకపోవడంతో కేసు కొట్టి వేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ కేసులో విచారణ పెండింగ్ లో ఉండగా అత్త బల్బళ్ళ వసుంధర(62) మరణించింది. నిందితుల తరపున ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, లంకిశెట్టి సాయి ఫణి సంతోష్, చిన్నంశెట్టి ఆశా నాగ మౌనిక, వందంశెట్టి జగతిశ్రీ న్యాయవాదులుగా వ్యవహరించారు..

# సర్.. నూరు శాతం పూర్తి చేశాం..

- జిల్లాలో 17,13,445 మంది ఓటర్ల వివరాలు డిజిటైజేషన్ చేశాం
- పారదర్శకంగా ముగిసిన డిజిటైజేషన్ /ఆన్లైన్ ప్రక్రియ
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**విజయవాడ, కలంకౌంటర్ :** ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో కీలక ప్రక్రియ అయిన ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ 100 శాతం పూర్తయిందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. మొత్తం 17,13,445 మంది ఓటర్లకు సంబంధించి పారదర్శకంగా డిజిటైజేషన్/ఆన్‌లైన్ ప్రక్రియ ముగిసినట్లు పేర్కొన్నారు. బీఎల్‌వోల ఇంటింటి సందర్శనకు ఈసీఐ ఈ నెల 24వ తేదీ వరకు గడువు పొడిగించినందున కార్యక్రమంలో మరింత పారదర్శకత, కచ్చితత్వానికి సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. ఈనెల 31వ తేదీన ముసాయిదా జాబితా ప్రచురణ ఉంటుందని.. అప్పటి నుంచి ఆగస్టు 30వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలకు వీలుంటుందన్నారు. ఈ నెల 31వ తేదీ నుంచి సెప్టెంబర్ 28వ తేదీ వరకు నోటీసు దశ, క్లెయిములు, అభ్యంతరాల పరిష్కారం ఉంటుందని వివరించారు. చివరిగా అక్టోబర్ 3వ తేదీన తుది జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితా విశిష్టత స్ఫూర్తితో ప్రతి ఒక్కరి సమన్వయంతో పనిచేసి ప్రక్రియను సజావుగా ముందుకు తీసుకెళ్లడంలో భాగస్వాములైనట్లు తెలిపారు. తిరువూరు నియోజకవర్గంలో 2,08,707 మంది ఓటర్లు, విజయవాడ పశ్చిమలో 2,56,980, విజయవాడ మధ్యలో 2,77,822, విజయవాడ తూర్పులో 2,69,734, మైలవరంలో 2,85,168, నందిగామలో 2,07,481, జగ్గయ్యపేటలో 2,07,553 మంది ఓటర్లకు సంబంధించి 100 శాతం డిజిటైజేషన్ పూర్తయినట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com